# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక








సంపుటి :12 సంచిక :312 సోమవారం 13-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## కాంగ్రెస్ ద్రోహం చేసింది



- తమిళనాడులో ఇండియా కూటమిలో విభేదాలు.
- విజయ్ నేతృత్వంలోని టీవీకే తో పొత్తును తిరస్కరించిన డీఎంకే.
- కాంగ్రెస్ తమను రాజకీయంగా ద్రోహం చేసిందని డీఎంకే ఆరోపణ.
- బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యత కోరుతున్న కాంగ్రెస్, విసికే .

చెన్నై

తమిళనాడు ఇండియా కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. రాష్ట్ర స్థాయిలో రాజకీయాలు ఎలా ఉన్నా జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కోవడానికి సహకరించుకోవాలని విజయ్ ప్రభుత్వంలో కీలక పార్టీగా ఉన్న వీసీకే పిలుపునిచ్చింది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. టీవీకేను ఇండియా కూటమిలోకి తీసుకురావాలని వీసీకే పిలుపును డీఎంకే వ్యతిరేకించింది. కేరళ, పశ్చిమ బెంగాల్ తరహా రాజకీయ విధానాన్ని అనుసరించాలని వీసీకే అధినేత -మిగతా 2 లో

## స్పామ్ కాల్స్ ఫియర్!




### రోజూ కోటిన్నరకు పైగానే


- అప్రమత్తంగా ఉండాలన్న టెలికాం శాఖ
- 1600 సిరీస్ నంబర్లతో కాల్స్
- ఈ సిరీస్ ఫోన్ కాల్స్ నంబర్లను బ్లాక్ చేయలేరు
- 140 నంబర్ల విషయంలో కన్ఫ్యూజన్ వద్దంటున్న ట్రాయ్

న్యూఢిల్లీ,

మీకు 1600, 140 సిరీస్ నంబర్ల నుంచి పదేపదే కాల్స్ వస్తున్నాయా? అయితే, మోసపోవద్దు.. స్పామ్ కాల్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ట్రాయ్ వినియోగదారులను హెచ్చరిస్తోంది. అయితే, నియంత్రిత సంస్థలు, -మిగతా 2 లో

## నామినేటెడ్ దక్కేదెవరికి?

### మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం



- చైర్మన్ల పనితీరుపై సీఎం రేవంత్ వద్ద నివేదిక
- 37 మంది చైర్మన్ల పదవీకాలం ముగింపు.. కొత్త నియామకాలపై దృష్టి
- ఒక్కో పదవికి పది మంది పోటీ.. నేతల్లో పెరిగిన ఆశలు
- పదవుల కోసం ఢిల్లీ స్థాయి వరకు కొనసాగుతున్న లాబీయింగ్
- తాజా మాజీ చైర్మన్లకు మరో అవకాశం ఇచ్చే యోచన
- ఎమ్మెల్యేలకు కీలక కార్పొరేషన్ల చైర్మన్ పదవుల ఛాన్స్



హైదరాబాద్ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)

నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చేయాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తున్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఈ నెల 14న పార్టీ ఇన్చార్జి మీనాక్షి హైదరాబాద్ కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకంపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. -మిగతా 2 లో



### నేపాల్‌లో మళ్లీ జెన్‌జీ

## ఉద్యమం..

- ముగ్గురి ఆత్మాహుతి యత్నం
- నిరుద్యోగంపై యువత ఆగ్రహం
- ప్రధాని రాజీనామాకు డిమాండ్

కాఠ్మాండూ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)

నేపాల్ యువతలో పెరుగుతున్న అసంతృప్తి మరోసారి వీధుల్లో నిరసన రూపం దాల్చింది. గత మూడు రోజుల్లో ముగ్గురు యువకులు పెట్రోల్ పోసుకొని ఆత్మాహుతి యత్నం చేశారు. ఇందులో ఇద్దరు చనిపోయారు. ప్రధాని బాలేంద్ర షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత కాఠ్మాండూ వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. బాలేంద్ర షా ప్రజా వ్యతిరేక, నిరంకుశ ధోరణిలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని జెన్-జీ నేపాల్ ఆర్గనైజేషన్ ఆరోపించింది. యువత ఉపాధి, ఆదాయం పెంచేందుకు బడ్జెట్‌లో, విధానాల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదని విమర్శించింది. యువతలో ఆశ, విశ్వాసం -మిగతా 2 లో



### నేడు పోలవరంకు

## సీఎం చంద్రబాబు

- పటిష్ట భద్రత ఏర్పాట్లపై అధికారుల సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న ముఖ్యమంత్రి
- ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష
- హెలిప్యాడ్, సభా ప్రాంగణం, భద్రతపై అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ భేటీ

అమరావతి -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)

ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లపై అధికారులు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన దృష్ట్యా ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో -మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాలకు వర్షాలు

- వచ్చే 3 రోజులు వానలే వానలు
- హెచ్చరించిన వాతావరణ శాఖ



2

## హెర్మూజ్ మళ్లీ మూసివేత..



- ప్రకటించిన ఇరాన్.. అదేం లేదన్న అమెరికా
- జలసంధిపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు
- చమురు, ఎల్పీజీ దిగుమతులపై భారత్‌కు ఆందోళన
- కొనసాగితే ముందుగా గ్యాస్ కొరతే!
- బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ ఎగబాకిన వైనం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతపై కేంద్రం అప్రమత్తం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన మార్కెట్లలో ఉత్కంఠ

2లో

## ఎల్నినోను ఎదుర్కొంటాం.

- నేడు ఇక్రిశాట్‌లో మంత్రి తుమ్మల సమీక్ష
- మూడు కంటింజెన్సీ ప్రణాళికలను పరిశీలించి తుది రూపునకు కసరత్తు



హైదరాబాద్ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల విభాగం అధికారులతో ఇక్రిశాట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తలతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ వరాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. మూడు దశల్లో కంటింజెన్సీ -మిగతా 2 లో



### పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే

## మేడిగడ్డపై కుట్ర

- గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ
- ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి
- ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

2 లో



## కన్నీటి వీడ్కోలు

- మైసూరులో అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంత్యక్రియలు పూర్తి
- కనియనహుండి ఫామ్‌హౌస్‌లో దహన సంస్కారాలు
- అంతిమయాత్రలో పోటెత్తిన అభిమాన సంద్రం
- మహారాజా కాలేజీ మైదానంలో సినీ ప్రముఖుల నివాళి
- మనవరాలు అప్సర చేతుల మీదుగా అంతిమ సంస్కారాలు

మైసూరు

గానకోకిల ఎస్. జానకి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కర్నాటక ప్రభుత్వం జానకమ్మ అంత్యక్రియలను మైసూరులో అధికారిక లాంఛనాలతో జరిపించింది. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకమ్మ కోరిక మేరకు కణియనహుండి ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అభిమాని ఫామ్ హౌస్ లో అంత్యక్రియలు హెచ్.డి. కోటే తాలూకాలోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం జానకి అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి -మిగతా 2 లో

## పేరు మార్చుకోవాలంటే ఎలా?

- 105 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ జెండాలు ఎగరేశాం
- ఈసీకి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత రిప్లై

2 లో



Journalist dairy
సోమవారం
13-07-2026
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్ ద్రోహం చేసింది

మొదటి తరువాయి

తోల్ తిరుమావళవన్ ప్రతిపాదించడంపై డీఎంకే వ్యాఖ్యానిస్తూ, ఆ రాష్ట్రాల మోడల్ తమిళనాడులో నడవదని చెప్పింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, ఎన్నికల తర్వాత విజయ్‌తో చేతులు కలిపింది. తమను కాంగ్రెస్ ద్రోహం చేసిందని డీఎంకే ఆరోపిస్తూ.. రాష్ట్రంలో మారిన పరిస్థితుల్లో టీవీకేతో చేతులు కలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. డీఎంకే ఎంపీ గణపతి పి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత కేవలం మంత్రి పదవుల కోసం టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలిపి, డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. ఇప్పుడు డీఎంకేను ఒప్పించడానికి వీసీకేని పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్‌పై ఆరోపించారు. పార్లమెంట్లో ఒక్కసీటు కూడా లేని టీవీకేను కూటమిలో చేర్చాలా.? అనే దానిపై సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాత్రం బీజేపీని ఎదుర్కోవడానికి విస్తృత ప్రతిపక్ష ఐక్యత అవసరమని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలని సూచించారు. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ స్పందిస్తూ.. ముందుగా విజయ్‌ను ఒప్పించండి, ఆయన డీఎంకేనూ తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా చెబుతున్నారని, అలాంటప్పుడు ఎలా కలిసి పనిచేస్తారు.? అని ప్రశ్నించారు.

# స్పామ్ కాల్స్ ఫియర్!

మొదటి తరువాయి

ప్రభుత్వ శాఖలు ప్రజలకు సేవలు, లావాదేవీలు, అధికారిక సమాచారాన్ని అందించేందుకు వాడే 1600 సిరీస్ ఫోన్ కాల్స్‌ను ఏ కాలర్ ఐడీ యాప్ కూడా బ్లాక్ చేయలేరని, ట్యాగ్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం కుదరదని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) స్పష్టం చేసింది. ట్రూకాలర్‌తో వివాదం నేపథ్యంలో ట్రాయ్ ఈ క్లారిటీ ఇచ్చింది. టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్ ప్రకారం.. 1600 సిరీస్ నంబర్లే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలు, ప్రభుత్వ విభాగాలు వంటి నియంత్రిత సంస్థలకు కేటాయించారు. ఈ సిరీస్ నంబర్ల ద్వారా వినియోగదారులకు లావాదేవీలు, సేవలకు సంబంధించిన కీలక సమాచారం అందిస్తారని తెలిపింది. అదేవిధంగా, 140 సిరీస్ నంబర్ల నుంచి వచ్చే ప్రమోషనల్ కాల్స్‌ను కూడా యాప్‌లు నేరుగా బ్లాక్ చేయలేవని ట్రాయ్ వెల్లడించింది. అయితే, ఈ కాల్స్‌ను రాకుండా ఆపాలంటే మాత్రం వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను డూ నాట్ డిస్టర్బ్ రిజిస్టర్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా సూచించింది. అప్పుడు మాత్రమే ఈ సిరీస్ నంబర్లను కూడా టెలికాం ఆపరేటర్ల ద్వారా బ్లాక్ చేయొచ్చని సూచించింది.

వినియోగదారులు అలర్ట్‌గా ఉండాలని..

మరోవైపు.. ట్రూకాలర్ సీఈఓ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా మాత్రం 140, 1600 సిరీస్ నంబర్ల నుంచే పెద్దఎత్తున స్పామ్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఈ రెండు సిరీస్‌ల నుంచి వచ్చే 5.1 కోట్లకు పైగా కాల్స్ వస్తున్నా వినియోగదారులు కాల్స్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పారు. ముఖ్యంగా 1600 సిరీస్ కాల్స్‌ను బ్లాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తద్వారా అధికారిక కాల్స్, స్పామ్ కాల్స్ మధ్య తేడాను గుర్తించి వినియోగదారులు అలర్ట్‌గా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి 208 శాతం బ్లాక్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# హెర్మూజ్ మళ్లీ మూసివేత..

- ప్రకటించిన ఇరాన్.. అదేం లేదన్న అమెరికా
- జలసంధిపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు
- చమురు, ఎల్పీజీ దిగుమతులపై భారత్‌కు ఆందోళన
- కొనసాగితే ముందుగా గ్యాస్ కొరతే!
- బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ ఎగబాకిన వైనం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతపై కేంద్రం అప్రమత్తం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన మార్కెట్లలో ఉత్కంఠ

టెహ్రాన్

నౌకాయానానికి వీలు లేకుండా హెర్మూజ్ జలసంధిని మూసివేసినట్టు ఇరాన్ మరోసారి ప్రకటించింది. గల్ఫ్‌లో అమెరికా తన చట్టవిరుద్ధ కదలికలను కొనసాగిస్తూనే ఉందని ఆరోపించింది. కాగా, ఇరాన్ ప్రకటనకు విరుద్ధంగా ఈ వ్యూహాత్మక జలమార్గం తెరిచే ఉన్నట్టు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌కు దానిపై ఎలాంటి నియంత్రణ లేదని, ఈ మార్గంలో నౌకల వాణిజ్య రవాణా యథా ప్రకారం కొనసాగుతున్నదని స్పష్టం చేసింది. కాగా, ఈ ప్రాంతంలో అమెరికా వైఖరి కారణంగా ఈ జలసంధి మీదుగా ఎలాంటి నౌకల రాకపోకలను అనుమతించబోమని టెహ్రాన్‌కు చెందిన పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ అథారిటీ (పీజీఎస్ఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే హెర్మూజ్ జలసంధి మూసివేసినట్టు ఇరాన్ చేసిన ప్రకటనను అగ్రరాజ్యం తోసిపుచ్చుతూ ఈ జలమార్గంలో నౌకాయానం యథావిధిగా జరుగుతున్నదని ప్రకటించింది. ఇదే విషయాన్ని ఆదివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా నిర్ధారించారు. ఈ మార్గంలో వాణిజ్య నౌకల రవాణాకు ఎలాంటి ఆటంకం లేదని పేర్కొన్నారు.



భారత్‌లో మళ్లీ ఎల్పీజీ సంక్షోభం?

హెర్మూజ్ జలసంధిని మూసివేయడం, పశ్చిమాసియాలో తిరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటం చూస్తుంటే భారత్‌లో మరోసారి చమురు, ఎల్పీజీ సంక్షోభం తప్పదని అనిపిస్తున్నది. భారత్‌కు అధిక మొత్తంలో చమురు, ఎల్పీజీ హెర్మూజ్ జలసంధి మీదుగానే దిగుమతి అవుతుండటంతో మరోసారి చిక్కులు తప్పేట్టు లేవు.


మొదటిగా వచ్చేది గ్యాస్ కొరతే

హెర్మూజ్ మూసివేత కనుక కొనసాగితే మొట్టమొదట మన దేశంలో ఏర్పడేది గ్యాస్ కొరతే. జూలై 9 తర్వాత అమెరికా తాజా దాడుల కారణంగా బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 79 డాలర్లకు ఎగబాకింది. అలాగే గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కూడా ప్రభుత్వానికి ఆందోళనకరంగా మారింది. యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్‌ల్లో సుమారు కోటి మందికి పైగా భారతీయులు నివసిస్తున్నారు.

## పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

-గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ
-ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి
-ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

హైదరాబాద్



పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత రెండేండ్లుగా మేడిగడ్డకు మరమ్మత్తు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్లు బంద్ పెట్టి, నీళ్లను కిందకు వదిలేస్తూ ఆంధ్రా ఆయకట్టుకు మేలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా ముఖ్యమని నిపుణులు చెబుతున్న మాటలను సీఎం ఖాతరు చేయడం లేదన్నారు. ప్రస్తుతం గోదావరిలో పారుతున్న 50 వేల క్యూసెక్కుల వరదను కన్నెపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. దేవాదులలో 10 మోటార్లు ఉంటే 4 మాత్రమే నడుపుతూ.. 2,500 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట కేవలం 1,200 క్యూసెక్కులు మాత్రమే ఎత్తుతున్నారని ఆరోపించారు. ఫలితంగా వరంగల్, ధర్మసాగర్, పాలకుర్తిల్లో 75 శాతం చెరువులు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు గోదావరిలో నీళ్లే లేవని అబద్ధం చెప్పిన సీఎం... పారుతున్న గోదావరిని లైవ్ లో చూపించగానే మాటమార్చి కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి మోటార్లు ఎలా నడుపుతారంటూ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 2028లో 28 లక్ష లు, 2025లో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా భద్రాచలానికి ఎలాంటి ముప్పు జరగలేదని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల రెండు బ్యారేజీల్లో మొత్తం 8 టీఎంసీలంటే దాదాపు 80 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుందని చెప్పారు. ఇదే విషయాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు చెబితే సీఎం జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. నిన్నటి దాకా నిపుణుల కమిటీ, రిటైర్డ్ ఇంజినీర్లు అని చెప్పిన సీఎం.. ఇప్పుడు నీళ్లు ఎత్తమని టెక్నికల్ సూచన చేయగానే వారిని జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నామినేటెడ్ దక్కేదెవరికి?

మొదటి తరువాయి

ఒక్కో పదవికి 10 మంది పోటీ..

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవి కాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ సౌకర్యం లభిస్తుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికే తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్ మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

పెద్ద ఎత్తున లాబీయింగ్

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్ గా పెట్టుకున్న మిగతా 07లో.. లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్చార్జిల మనసు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైసెన్ క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల



ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది. పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పనిచేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఎమ్మెల్యేలకు సైతం పదవులు

ఈసారి నామినేటెడ్ పదవుల భర్తీలో ఎమ్మెల్యేలు సైతం జాబితాలో ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా ఆర్టీసీ, సివిల్ సప్లై కార్పొరేషన్ లాంటి కీలక సంస్థల చైర్మన్ పదవులు ఇచ్చే ఛాన్స్ ఉందని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు. గతంలో సివిల్ సప్లై కార్పొరేషన్ పదవిని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ కు కేటాయించారు. కానీ ఆయన ఆ పదవిని తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. మంత్రి పదవి కోసం ఆశలుపెట్టుకున్న ఎమ్మెల్యేలకు కీలకమైన సంస్థలకు చైర్మన్లుగా నియమించే ఛాన్స్ ఉంది. “ఈసారి పెద్ద మొత్తంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుంది. చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను సైతం ప్రకటించవచ్చు” అని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు.

## నేపాల్‌లో మళ్లీ జెన్‌జీ

# ఉద్యమం..

మొదటి తరువాయి

నెలకొల్పడంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష నేపాలీ కాంగ్రెస్ ఆరోపించింది. యువత ఆత్మాహుతి చేసుకోవడాన్ని ప్రభుత్వ వైఫల్యంగా 2023లో బాలెన్ షా అభివర్ణించారు. తాజా నిరసనల సందర్భంగా నాడు ఆయన అన్న ఆ మాటలపై ప్రజలు చర్చించుకొంటున్నారు.



తాజా ఆందోళనలపై ఆయన మౌనం వహించడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. యువత మానసిక ఆరోగ్యం క్షీణించడం, నిరుద్యోగం పెరుగడం, ప్రభుత్వ విధానాల ప్రభావంపై తాజా నిరసనలు మళ్లీ ఆందోళనను రేకెత్తించాయి. యువత సమస్యలపై ప్రభుత్వం అర్థవంతమైన చర్యలు తీసుకోకపోతే నిరసనల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు హెచ్చరించాయి.

## నేడు పోలవరంకు

# సీఎం చంద్రబాబు

మొదటి తరువాయి

అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వై. ప్రసాద్ రావు, ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ వింగ్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన భద్రత ఏర్పాట్లను వారు క్షుణ్ణంగా సమీక్షించారు. అడుగడుగునా అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ ఏర్పాట్లపై పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏపీ భద్రతతో పాటు, సాధారణ ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అత్యవసర సేవల లభ్యతపై సమావేశంలో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి భద్రత, సురక్షితంగా పర్యటనలు చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు అంకితభావంతో, పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ కీలక సమావేశంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో పాటు పోలవరం ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్షాలు


- వచ్చే 3 రోజులు వానలే వానలు
- హెచ్చరించిన వాతావరణ శాఖ

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం భిన్న వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాలలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశల నుండి వేడి గాలులు వీస్తుండటంతో ఏపీలో ఎండల తీవ్రత పెరగనుంది. మరోవైపు తెలంగాణలో రుతుపవన ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం

ఆదివారం ఈ ప్రాంతంలో వాతావరణం కాస్త మిశ్రమంగా ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే ఛాన్స్ ఉంది. అయితే ఇదే సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈక గాలులు వీస్తాయి. ఒకటి లేదా రెండు చోట్ల తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉంది. సోమ, మంగళవారాల్లో వర్షాలు




తగ్గి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఎండల తీవ్రత పెరగడంతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు, ఒకటి లేదా రెండు చోట్ల వడగాలులు వీచే అవకాశం ఉంది.

దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్

ఈ ప్రాంతంలో రాబోయే మూడు రోజుల పాటు పూర్తిగా పొడి వాతావరణమే ఉంటుంది. ఎండలు మండిపోనున్నాయి. ఈరోజు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో రేపు, ఎల్లుండి గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయి. తీర ప్రాంత వాసులు వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

రాయలసీమ

రాయలసీమ వ్యాప్తంగా ఎలాంటి వర్ష సూచన లేదు. పూర్తిగా పొడి వాతావరణం ఉంటుంది. అయితే ఉపరితల గాలులు బలంగా వీచనున్నాయి. ఈరోజు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో రాబోయే రెండు రోజులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

తెలంగాణ వాతావరణ సూచన

ప్రస్తుతం రుతుపవన ద్రోణి సగటు సముద్రమట్టం వద్ద శ్రీ గంగానగర్, హిస్సార్, మీరట్, గోరఖ్‌పూర్ మీదుగా దక్షిణ అస్సాం వరకు కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు లేదా చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో ఉపరితల గాలులు అత్యంత బలంగా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ప్రమాదం ఉంది. మధ్య, దక్షిణ తెలంగాణ ఈ ప్రాంతాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి.

# ఎల్నినోను ఎదుర్కొంటాం..

మొదటి తరువాయి

ప్రణాళిక, జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయగా ఈ నెల 15 నుంచి అమలు చేయాల్సిన ప్రణాళికపై సమీక్ష నిర్వహించనున్నారు.

30 నుంచి 40 లక్షల ఎకరాల్లో వరిసాగు ఈ ఖరీఫ్‌లో ఎల్నినో ప్రభావం కొనసాగితే వరి 30 నుంచి 40 లక్షల ఎకరాల్లో సాగు అయ్యే అవకాశాలు ఉన్నట్లు మంత్రి చెప్పారు.

అందుకునుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాలకు 3 దశల్లో ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ నెల 10 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదకాగా, 20 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. లోటు జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, సాగు పురోగతి, నేల తేమ, విత్తనాల లభ్యత, రైతుల అవసరాలపై రోజువారీ నివేదికలను విశ్లేషిస్తూ, అవసరమైన చోట వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు.

# కన్నీటి వీడ్కోలు

మొదటి తరువ్వాయి

అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జానకి కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలోనే మరణించడంతో ఆమె మనవరాలు అప్సర దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించారు. కనియనహుండి గ్రామంలోని జానకి అభిమాని నవీన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ అంత్యక్రియలు జరిగాయి.


భావోద్వేగానికి గురైన అభిమానులు

ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహారాజా కాలేజ్ మైదానంలో సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, కళాకారులు, వేలాది మంది అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ నివాళులర్పించారు. అనంతరం అంతిమ సంస్కారాల కోసం ఆమె భౌతికకాయాన్ని హెచ్.డి. కోటె తాలూకాలోని కనియనహుండి తోటలోకి తరలించారు. అక్కడ కాసేపు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 3:05 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. ?ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు, అధికారులు వాహనాల్లో వెంట వెళ్లారు. తమ అభిమాన గాయనికి చివరిసారిగా అభిమానులు దారి పొడవునా నీరాజనం పట్టారు. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

# పేరు మార్చుకోవాలంటే ఎలా?

-105 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ జెండాలు ఎగరేశాం
- ఈసీకి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత రిప్లై

హైదరాబాద్



కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదించిన పేరును నమ్ముకుని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలంటే తమకు తీరనష్టం కలుగుతుందని, అన్యాయం చేసినట్టువుతుందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపునివ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రిప్లై ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్‌కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో పాటు ఎన్నికల కమిషనర్లకు లేఖ రాశారు. ఈసీ ఆమోదించిన అనేక పార్టీల పేర్లు ఒకేలా ఉన్నాయని.. ఒక్క తెలంగాణలోనే తెలంగాణ రాజ్యసమితి, తెలంగాణ రక్షణ సమితి పేర్లతో రెండు పార్టీలకు గుర్తింపునిచ్చారని తెలిపారు. వాటికి లేని అభ్యంతరాలు తెలంగాణ రక్షణ సేనపై ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన వెయ్యి అభ్యంతరాలను తమకు పంపాలని కోరారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణపరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అభ్యంతరాలను తమకు పంపకపోతే తాము సమాధానం ఎలా చెప్పాలన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# హత్యకు కుట్ర భగ్నం..

**లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు షూటర్‌లు అరెస్ట్**



**న్యూఢిల్లీ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
ఢిల్లీ పరిధిలోని రోహిణి జిల్లా ప్రత్యేక పోలీసు దళం తాజాగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు షూటర్ల ను అరెస్ట్ చేసింది. వారు ఢిల్లీలో ఓ హత్యకు కుట్ర చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన పక్కా సమాచారం ముందుగా అందడంతో రోహిణి జిల్లా స్పెషల్ స్టాఫ్ వీరి కదలికలపై నిఘా ఉంచి చివరకు అదుపులోకి తీసుకుంది. విదేశాల్లో ఉన్న నెట్‌వర్క్ ద్వారా ఈ షూటర్లకు ఆదేశాలు అందుతున్నాయని, వాటి ఆధారంగానే వీరు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని సమాచారం.ఢిల్లీలో గతంలో జరిగిన పలు నేరాల్లో ఈ షూటర్లు నిందితులుగా ఉన్నారు. గతంలోనూ వీరు నిర్దేశిత లక్ష్యాలపై కాల్పులు జరిపిన ఘటనల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అమెరికాలోనూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై అక్కడి దర్యాప్తు సంస్థలు గట్టి నిఘా పెట్టాయి. జూలై 7 నుంచి అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఈ ముఠాపై 'ఆపరేషన్ హార్డ్ బాల్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకున్నారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠాతోపాటు అతడి ప్రధాన అనుచరులైన గోల్డీ బ్రార్, జగ్గూ భగవాన్‌పురియా నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపడుతున్నారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ గోల్డీ బ్రార్‌పై కఠిన చర్యలకు సిద్ధమైంది. సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ అరెస్టుకు అవసరమైన సమాచారం అందించిన వారికి 50,000 డాలర్ల (సుమారు రూ. 43 లక్షలు) బహుమతిని అందజేస్తామని ప్రకటించింది. లారెన్స్ బిష్ణోయ్‌పై హత్య, హత్యాయత్నం, దోపిడీ, బెదిరింపులు వంటి అనేక కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం అతను జైల్లోనే ఉన్నప్పటికీ అక్కడి నుంచే తన నేర సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. అతడి గ్యాంగ్‌లో పెద్ద సంఖ్యలో షూటర్లు ఉన్నారు.

# ఇరాన్‌కు 24 గంటలు గడువు ఇస్తున్నాం..

**-హర్మూజ్ అంశంలో అమెరికా వార్నింగ్..!**



**న్యూఢిల్లీ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
హర్మూజ్ జలసంధి లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ ను అమెరికా హెచ్చరించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయానానికి పూర్తిగా తెరిచి ఉంటుందని, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు జరగవని పేర్కొంటూ 24 గంటల్లోగా ఇరాన్ బహిరంగ ప్రకటన చేయాలని వాషింగ్టన్ స్పష్టం చేసినట్టు సమాచారం. గడువులోగా చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన సైనిక, ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించినట్టు తెలుస్తోంది.ఈ హెచ్చరికను మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు అమెరికా చేరవేసినట్టు సమాచారం. 'నౌకలపై కాల్పులు ఆపేస్తామని బహిరంగంగా చెప్పాలి. అలాగే తాము తప్పు చేశామని వాళ్లు కనీసం పరోక్షంగానైనా అంగీకరించాలని మేము కోరుకుంటున్నాం. కాల్పులు ఆపేస్తామనేదే రేపు వారి ప్రకటన కావాలని, లేకపోతే వారికి అది మంచి రోజు కాబోదని అమెరికా అధికారి హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒమాన్‌లో మధ్యవర్తిత్వ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం ఇరాన్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయితే గడువులోగా స్పష్టమైన హామీ రాకపోతే పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రష్యాకు మళ్లీ షాకిచ్చిన ఉక్రెయిన్..

**రష్యా చమురుశుద్ధి కర్మాగారంపై మెరుపు దాడి**



**న్యూఢిల్లీ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
రష్యాకు ఉక్రెయిన్ మరో షాకిచ్చింది. సమర రీజియన్లోని సిజ్రాన్ చమురు శుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్‌లు మెరుపు దాడి చేశాయి. దాంతో ఆయిల్ రిఫైనరీ కి భారీ నష్టం వాటిల్లింది. జూలై 11-12 మధ్యలో ఈ దాడులు చోటు చేసుకొన్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడంచారు. ఈ రిఫైనరీ ఏటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు.ఆ రిఫైనరీ నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళ్తాయి. వాటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు. గతంలో ఈ రిఫైనరీని లక్ష్యంగా చేసుకొని ఏప్రిల్ 18, మే 11వ తేదీల్లో ఉక్రెయిన్ దాడులు చేసింది. ఉక్రెయిన్ ఇక్కడితో ఆగకుండా అజోవ్ సముద్రంలో 10 ట్యాంకర్లు, నాలుగు ఫెర్రీలను కూడా ధ్వంసం చేసింది. అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకుంటూ ఈ ట్యాంకర్లు రష్యా చమురును విక్రయిస్తుంటాయి. ఇక ధ్వంసమైన ఫెర్రీలు రష్యా సేనలకు లాజిస్టిక్స్ అవసరాలు, కార్గో తరలింపునకు వినియోగిస్తున్నారు. జూలై 11న భారీగా లూబ్రికెంట్ ఆయిల్ తరలిస్తున్న ఓ రైలును టోక్‌మాక్ వద్ద ఉక్రెయిన్ దళాలు ధ్వంసం చేశాయి. దాంతోపాటు పెద్ద ఎత్తున చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ రక్షణ దళాలు ప్రకటించుకొన్నాయి.

# ఇక ప్రయివేటు క్షిపణులు

- -కేంద్రంలోని మోడీ సర్కారు పన్నాగాలు
- -తొలి దశలో అస్త్ర మార్క్-2 క్షిపణులు!
- -ఉత్పత్తి లక్ష్యాల భారం పేరిట బీడీఎల్ నిర్వీర్యం
- -రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కొత్త వ్యూహమంటూ అడ్డదారి
- -బరిలో ఐకామ్, అదానీ, ఫోర్జ్, టాటా, మహీంద్రా
- -ముమ్మాటికీ దేశభద్రతకు ముప్పే : రక్షణశాఖ మాజీ సైన్యాధిపతులు




**న్యూఢిల్లీ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
కేంద్రంలోని మోడీ సర్కారు దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల్ని విక్రయిస్తుంటే..ఇపుడు కీలకమైన రక్షణ శాఖను కూడా హోల్ సేల్ గా ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టే దిశగా పావులు కదుపుతోంది. దేశ భద్రతలో కీలకమైన క్షిపణుల తయారీని కూడా కార్పొరేట్ల గుప్పెట్లోకి తీసుకెళ్లేలా కేంద్రంలోని మోడీ సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగా దేశ రక్షణ రంగంలో మరో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు సమాచారం. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితమైన క్షిపణుల తయారీలో ఇకపై ప్రయివేటు సంస్థలకు కూడా అవకాశం కల్పించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారత రక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్, దేశ సాయుధ బలగాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ చర్యతో స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యం పెరగడంతో పాటు రక్షణ ఎగుమతులు కూడా మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికారుల వాదన. ?ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం.. రక్షణ రంగంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని క్రమంగా పెంచుతూవస్తోంది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళా నికి అవసరమైన పరికరాల తయారీలో ప్రయివేటు సంస్థలకు తలుపులు తెరిచింది. ఇప్పుడు అత్యంత వ్యూహాత్మకంగా భావించే క్షిపణుల తయారీలోనూ ప్రయివేటు రంగాన్ని భాగస్వామ్యం చేయాలని కేంద్రం ప్రయత్నించడం దేశ భద్రతకు అంత ఆరోగ్యకరం కాదని రక్షణ రంగ నిపుణులు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)ను నిర్వర్యం చేసే ఇలాంటి ప్రయత్నాలను కేంద్రం విరమించుకోవాలని సూచిస్తున్నారు.


**డిమాండ్ పేరుతో బుకాయింపు**

ప్రస్తుతం భారత సాయుధ బలగాలతో పాటు మిత్రదేశాల నుంచి కూడా స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు భారీ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. అయితే ఆ అవసరాలన్నింటినీ ఒక్క బీడీఎల్ మాత్రమే తీర్చడం కష్టంగా మారుతోందని కేంద్రం సాకులు చెబుతోంది. బీడీఎల్‌కు తగిన బడ్జెట్ కేటాయింపులు, నియామకాలు చేస్తే ఉత్పత్తి లక్ష్యాలు అందుకోవడం పెద్ద కష్టమేమీ కాబోదని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు. అంతేకాని దీనిని సాకుగా చూపి క్షిపణి తయారీ వంటి కీలక విభాగాలను ప్రయివేటు రంగ సంస్థలకు కట్టబెట్టేస్తే అవి లాభాల వేటలో దేశ భద్రతను సైతం పణంగా పెట్టే దుస్థితి వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ప్రణాళికలో భాగంగా మొదటి దశలో గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అస్త్ర మార్క్-2 క్షిపణుల తయారీకి ప్రయివేటు సంస్థలను ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఐకామ్, అదానీ గ్రూప్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

# 30 సెకండ్లలో 195 ముద్దులు.. బ్రెజిల్ జంట గిన్నిస్ రికార్డ్

**న్యూఢిల్లీ --జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
ఓ బ్రెజిల్ జంట తమ ప్రేమను గిన్నిస్ రికార్డ్ సాధనకు వేదికగా మలచుకొంది. రెనటో అల్వెస్, అతడి ప్రియురాలు నైరా రాబెర్టా 30 సెకండ్లలో 195 ముద్దులు పెట్టుకొని అర నిమిషంలో అత్యధిక ముద్దులు పెట్టుకొన్న జంటగా నిలిచింది. అంతర్జాతీయ ముద్దుల దినోత్సవం జరుపుకొనే జూలై 6 తర్వాత కొంత కాలానికే ఈ ఘనతను ఈ జంట సాధించింది. 'ప్రపంచంలోనే అత్యుత్తమ జంట'గా తమను నమ్ముతూ, తమది దృఢమైన బంధంగా భావించిన వీరిద్దరూ ఈ ప్రయత్నాన్ని సవాల్‌గా తీసుకొన్నారు. ఒక నిమిషంలో ఎక్కువ ముద్దులు పెట్టుకొన్న జంటగా నిలవడంపై ఈ జంట ఇప్పుడు దృష్టి సారించింది.





# అమర్‌నాథ్ యాత్రికుల బస్సు బోల్తా..

**-16 మందికి గాయాలు**



**న్యూఢిల్లీ -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
అమర్‌నాథ్ యాత్రికుల తో వెళ్తున్న బస్సు బోల్తా పడటంతో 16 మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా లో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోందిజమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

# త్వరలో ప్రజల ముందుకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ..!




**న్యూఢిల్లీ --జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జూలై 23న టెహ్రాన్‌లో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను మొజ్తబా నిర్వహించనున్నారని సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్యలో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని కీలక నేతలందరూ పాల్గొంటారని వారు తెలిపారు.సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించలేదు. భద్రత దృష్ట్యా ఇటీవల నిర్వహించిన తండ్రి అంత్యక్రియలకు కూడా దూరంగా ఉన్నారు. రెండు వారాల కిందట తన సతీమణి అంత్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు ఫిబ్రవరి 28 నాటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తబా చికిత్స తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే నాటి నుంచి కూడా ఇరాన్‌పై దాడులను సోషల్ మీడియా వేదికగా మొజ్తాబా ఖండిస్తూ వస్తున్నారు. శనివారం కూడా సోషల్ మీడియా మొజ్తాబా ఒక పోస్ట్ పెట్టారు. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు.

# వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడి.. బావిలో పడేసిన వ్యక్తి



**తిరువనంతపురం -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
ఒక వ్యక్తి వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మరణించినట్లు భావించాడు. ఆ మహిళను బావిలో పడేశాడు. మద్యం మత్తులో ఈ విషయాన్ని స్నేహితుడికి అతడు చెప్పడంతో పోలీసులకు తెలిసి అరెస్ట్ చేశారు. కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సురేష్ అనే వ్యక్తి రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. పెరుంబవూర్ రైల్వే పట్టాల సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న అద్దె ఇంట్లో అతడు నివసిస్తున్నాడు.కాగా, కొన్ని రోజుల కిందట 65 ఏళ్ల వృద్ధురాలిని సురేష్ తన ఇంటికి తీసుకువచ్చాడు. వారిద్దరి మధ్య గొడవ జరుగడంతో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయిందని భావించాడు. సమీపంలోని ఒక బావిలో ఆమెను పడేశాడు. మరోవైపు శనివారం మద్యం సేవించిన సురేష్ ఆ మత్తులో ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పాడు. దీంతో పోలీసులకు ఇది తెలిసింది. ఈ నేపథ్యంలో సురేష్ ఇంటికి చేరుకుని సోదా చేశారు. ఇంట్లో ఉన్న అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సురేష్ సమాచారం ఆధారంగా అగ్నిమాపక సిబ్బందితో కలిసి వృద్ధురాలి మృతదేహాన్ని బావి నుంచి పోలీసులు వెలికితీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సురేష్‌ను అరెస్ట్ చేసి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సురేష్ స్నేహితులను కూడా విచారిస్తున్నట్లు వెల్లడించారు.

# అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు



**జెరూసలెం, - -జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)**
ఓ వైపు యుద్ధాలు చేస్తూ.. మరోవైపు ఓటర్లను ఎదుర్కొనేందుకు నెతన్యాహు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇజ్రాయెల్‌లో తదుపరి సార్వత్రిక ఎన్నికలు అక్టోబర్ 27న జరుగుతాయని అధికార 'లికుడ్' పార్టీ కీలక సభ్యుడు ఒఫిర్ కట్జ్ ఆదివారం ప్రకటించారు. ఆ దేశంలో 1988 తర్వాత నిర్ణీత సమయంలో జరుగుతున్న ఎన్నికలు ఇవే కావటం గమనార్హం.అంతేగాక గత 50 ఏండ్లలో నాలుగేండ్లు పాలించిన సర్కార్‌గా నెతన్యాహు ప్రభుత్వం నిలిచింది. 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే ఒక పార్టీకి 61 సీట్లు అవసరం. గత బుధవారం చానల్ 13 ప్రచురించిన పోల్ ప్రకారం, ఈసారి నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ కూటమికి ఓటమి ఖాయమని అంచనావేసింది.

# ఎన్ కౌంటర్ చేసి పారేయండి అతడి సోదరుడిని,తండ్రిని కూడా శిక్షించాలి

**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-బాధితురాలి కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం..**
**-షాబాద్ పోలీసుల నిర్లక్ష్యమే ఈ హత్యలకు కారణం**
**-ఎస్సై, సిఐని సస్పెండ్ చేసి చేయి దులుపుకుంటే సరిపోదు..**
**-చట్టాలను మరింత కఠిన తరం చేయాలి..**
**-ప్రభుత్వాల నుంచి కూడా తప్పులు.. అందుకే ఈ దారుణాలు.. బాధిత వికలాంగురాలికి అండగా ఉంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి హామీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)** ప్రేమ పేరుతో ఒక బాలికను వేధింపులకు గురిచేసి ఆ కుటుంబాన్ని హతమార్చిన ప్రేమోన్మాది ని ఎన్కౌంటర్ చేసి పారేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్వేగంతో మాట్లాడారు. షాబాద్ మండలంలో బాలిక కుటుంబాన్ని, తన కుటుంబాన్ని కూడా హత్య చేసిన ఉన్మాది సంఘటన నేపథ్యంలో చలించిన ఆయన ఆదివారం షాబాద్ మండల కేంద్రానికి వెళ్లి బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. బాలికకు నివాళులు అర్పించి అనాధగా మిగిలిన వికలాంగురాలిని ఆదుకునే నిమిత్తం లక్ష రూపాయలు ఆర్థికసాయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్తు తెలంగాణను చలింపజేసిన ఈ సంఘటన అత్యంత దారుణమని అన్నారు. సర్వ సమాజం, రాజకీయ నాయకులు, పోలీసులు కూడా ఈ సంఘటన పట్ల సిగ్గుపడాలని అన్నారు. ఇలాంటి క్రూర మృగాన్ని కేసు పెట్టినా కూడా పట్టుకోకుండా పోలీసులు తప్పు చేశారని అన్నారు. కేవలం ఎస్ఐ, సిఐని సస్పెండ్ చేసి చేయి దులుపుకుంటే సరిపోదని ఈ సంఘటనకు బాధ్యత వహించి పోలీసు ఉన్నతాధికారులు అంతకుడు రాజ్ కుమార్ ను ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. కాయ కష్టం చేసుకుని బతికే ఒక కుటుంబాన్ని పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకూడదని అన్నారు. ఇలాంటి వాళ్లను సమాజంలో తిరగనివ్వకుండా ముందే శిక్షించి ఉంటే ఈ సంఘటన జరిగేది కాదని అన్నారు. ఈ దుర్మార్గుడి సోదరుడు భాస్కర్ తన సోదరుని వెనకేసుకొచ్చి కేసులు కాకుండా కాపాడేవాడని, ఈ సంఘటనలో సోదరుడిని, నిందితుడి తండ్రిని కూడా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీస్ డిపార్ట్మెంట్ తన పని తాను సక్రమంగా చేసి ఉంటే ఈ సంఘటన జరిగేది కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఎన్ని కొత్త చట్టాలు తీసుకొచ్చినప్పటికీ వాటిని అమలు చేయాల్సిన బాధ్యత పోలీసుల మీదే ఉంటుందని అన్నారు. కానీ పోలీసులు ప్రతి తప్పుకు ఇతన్ని వెనుకోస్కొచ్చి ఇలాంటి కార్యక్రమాలలో స్పెషలిస్టుగా తయారు చేశారని ఆరోపించారు. కరడు కట్టిన ఇలాంటి నేరస్తులను విచ్చలవిడిగా రోడ్డుమీద వదిలేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు కూడా ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితం కాకుండా అధికార వ్యవస్థ, పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. వికలాంగురాలు అయిన బాధితురాలికి నిరంతరం అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు..

# వీర్లపల్లి స్టీల్ పరిశ్రమలో ప్రమాదం..

**-75 శాతం కాలిన గాయాలతో కార్మికుడు ఆస్పత్రిలో నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలోని కనకదుర్గ (శివ శక్తి) స్టీల్స్‌లో ఘటన**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలోని కనకదుర్గ స్టీల్స్ (శివ శక్తి స్టీల్స్) పరిశ్రమలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో పరిశ్రమ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికుడు భరత్ కుమార్ మిశ్రా (46) తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదంలో ఆయనకు సుమారు 75 శాతం వరకు కాలిన గాయాలు కావడంతో యాజమాన్యం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని, కనీసం 45 రోజులపాటు అత్యవసర వైద్యం అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం.అయితే చికిత్స ఖర్చులను తగ్గించుకునేందుకు యాజమాన్యం మరో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తోందని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. బాధితుడికి అత్యుత్తమ వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారిక వివరాలు ఇంకా వెల్లడికాలేదు. అలాగే పరిశ్రమ యాజమాన్యం లేదా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఘటనపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీల శాఖ అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా నిద్ర మత్తు వదలని అధికార యంత్రాంగం

**కనకదుర్గా స్టీల్స్ పరిశ్రమపై పై చర్యలు తీసుకోవాలి.**
**పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ నియోజక వర్గంలో ఉన్న పరిశ్రమలలో నిత్యం అనేక ప్రమాదాలు జరిగి వందలాది మంది కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నా, పరిశ్రమ లలో భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా లంచాల మత్తులో అధికార యంత్రాంగం మునిగి పోయిందని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు.

శనివారం నందిగామ మండలంలోని వీర్లపల్లి గ్రామంలో ఉన్న కనకదుర్గా స్టీల్ పరిశ్రమలో బాధ్యత ప్రమాణాలు లేక పోవడంతోనే బీహార్ కు చెందిన భారత్ కుమార్ మిశ్రా పై బాగా వేడి గా పౌడర్ మీద పడటంతో 75 శాతానికి పైన కాలిపోయాడని, యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తుంది . అక్కడ ఖర్చు ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో వేరే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆంధ్రా ప్రాంతానికి చెందిన యాజమాన్యం లాభాలే ధ్యేయంగా ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేకుండా పరిశ్రమను నడుపుతున్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు అక్కడ చనిపోయారని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడి కి నాణ్యమైన వైద్య రందించి ఆదుకోవాలి. ఇప్పటికైనా ఈ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి. మీకు చేతకాక పోతే మమల్ని తీసుకుపోండి లోపాలను చూపిస్తాం. వెంటనే కనకదుర్గ స్టీల్ పరిశ్రమపై చర్యలు తీసుకుని మీ నిజాయితీని నిరూపించుకోవాలని అధికారులను కోరారు.

# ఉగ్రవాదం-ఓ ఊసరవెల్లిని... గర్తించి,నిర్మూలించటమే ఛాలెంజ్

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద ఘటనలు తగ్గుతున్నాయనే గణాంకాలు మొదటి చూపులో ఆశాజనకంగా కనిపిస్తాయి. కొన్ని అంతర్జాతీయ నివేదికలు గత దశాబ్దంతో పోలిస్తే అనేక ప్రాంతాల్లో దాడుల సంఖ్య, మరణాల సంఖ్య తగ్గినట్లు సూచిస్తున్నాయి. అయితే గణాంకాల్లో కనిపించే ఈ తగ్గుదలనే వాస్తవ పరిస్థితిగా భావించడం ప్రమాదకరం. ఎందుకంటే ఉగ్రవాదం అనేది ఒక స్థిరమైన శత్రువు కాదు; కాలానికి అనుగుణంగా తన రూపాన్ని, వ్యూహాన్ని, లక్ష్యాన్ని మార్చుకుంటూ ముందుకు సాగే చలనశీలమైన ముప్పు. అందువల్ల కేవలం సంఖ్యల ఆధారంగా ప్రపంచం మరింత సురక్షితమైందని నిర్ణయించడం సరైన విశ్లేషణ కాదు.

గతంలో ఉగ్రవాద సంస్థలు పెద్దఎత్తున భూభాగాలను ఆక్రమించడం, ప్రత్యక్ష యుద్ధాలు చేయడం, భారీ పేలుళ్లకు పాల్పడటం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇచ్చేవి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. భౌగోళిక ఆధిపత్యం కంటే భావజాల వ్యాప్తి, చిన్న చిన్న స్వతంత్ర దాడులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆన్‌లైన్ నియామకం, డిజిటల్ ప్రచారం వంటి పద్ధతులు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. అందువల్ల దాడుల సంఖ్య తగ్గినా, వాటి ప్రభావం తగ్గిందని చెప్పలేం.ప్రపంచ ఉగ్రవాద సూచీ (గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్) తాజా అంచనాల ప్రకారం, ఉగ్రవాదానికి సంబంధించిన భారం ఇప్పటికీ ప్రధానంగా సాహెల్ ప్రాంతం, సహారా దక్షిణ ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ వంటి ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉంది. ప్రపంచ ఉగ్రవాద మరణాల్లో గణనీయమైన భాగం ఈ ప్రాంతాల నుంచే నమోదవుతోంది. (లభ్యమైన తాజా అంతర్జాతీయ డేటా ఆధారంగా -- 2025 నివేదిక). అంటే సమస్య అంతరించిపోలేదు; కేవలం కేంద్రాలు మారాయి.మరో ముఖ్యమైన పరిణామం "లోన్-వుల్ఫ్" దాడుల పెరుగుదల. ఒక పెద్ద ఉగ్రసంస్థకు ప్రత్యక్ష సంబంధం లేకుండానే, ఇంటర్నెట్ ద్వారా తీవ్రవాద భావజాలానికి ప్రభావితమై వ్యక్తిగతంగా దాడులు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిని ముందుగానే గుర్తించడం సంప్రదాయ నిఘా వ్యవస్థలకు చాలా కష్టం. ఫలితంగా పెద్ద కుట్రలను అడ్డుకోవడం కంటే చిన్న చిన్న దాడులను నిరోధించడం భద్రతా సంస్థలకు కొత్త సవాలుగా మారింది.



డిజిటల్ ప్రపంచం ఉగ్రవాదానికి కొత్త ఆయుధంగా మారింది. సామాజిక మాధ్యమాలు, గుప్త సందేశ వ్యవస్థలు, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వేదికలు, క్రిప్టోకరెన్సీల వినియోగం ద్వారా నియామకం, నిధుల సేకరణ, శిక్షణ, ప్రచారం మరింత సులభమయ్యాయి. ఒకప్పుడు శిక్షణ శిబిరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు ఒక మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు; తీవ్రవాద ప్రచారం ప్రపంచవ్యాప్తంగా క్షణాల్లో వ్యాపిస్తోంది.కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)(ఏఐ), డ్రోన్లు, స్వయంచాలక (ఆటోమాటిక్) సాంకేతికతలు కూడా కొత్త ప్రమాదాలకు దారితీస్తున్నాయి. తక్కువ ఖర్చుతో డ్రోన్లను పేలుడు పదార్థాల వాహకాలుగా ఉపయోగించే అవకాశం పెరిగింది. కృత్రిమ మేధస్సుతో తప్పుడు వీడియోలు, నకిలీ ప్రసంగాలు, ద్వేష ప్రచారాన్ని మరింత విశ్వసనీయంగా రూపొందించే సామర్థ్యం పెరుగుతోంది. భవిష్యత్తులో ఉగ్రవాదం కేవలం తుపాకులు, బాంబులతో మాత్రమే కాకుండా సమాచార యుద్ధం, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం రూపంలో కూడా వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

భారత్‌కు ఈ పరిస్థితి ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది. సరిహద్దు దాటి ప్రోత్సహించబడే ఉగ్రవాదం, జమ్మూ-కాశ్మీర్‌లో పరిస్థితులు, సరిహద్దు చొరబాట్లు, డ్రోన్‌ల ద్వారా ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలు ఇప్పటికీ భద్రతాపరమైన ఆందోళనలుగానే ఉన్నాయి. అదే సమయంలో దేశీయంగా సామాజిక విభజనలు, మత విద్వేషాలు, ద్వేష ప్రచారం, ఆన్‌లైన్ తీవ్రవాదీకరణ వంటి అంశాలను కూడా నిర్లక్ష్యం చేయరాదు. ఉగ్రవాదం కేవలం సరిహద్దుల నుంచే వస్తుందని భావించడం నేటి పరిస్థితుల్లో సరైన దృక్పథం కాదు.

అంతర్జాతీయ సహకారం కూడా గతంతో పోలిస్తే మరింత కీలకంగా మారింది. ఉగ్రవాద నిధుల నియంత్రణ, సమాచార మార్పిడి, సైబర్ నిఘా, అంతర్జాతీయ నేర ముఠాలపై సంయుక్త చర్యలు లేకుండా ఏ దేశమూ ఒంటరిగా ఈ ముప్పును ఎదుర్కోలేదు. ఉగ్రవాదానికి ఆర్థిక వనరులు, ఆయుధాల సరఫరా, డిజిటల్ మౌలిక వసతులను అడ్డుకోవడం కూడా సైనిక చర్యలంతే ముఖ్యమైన అంశంగా మారింది.

అయితే భద్రత పేరుతో ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడం కూడా ప్రమాదకరమే. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం చట్టబద్ధంగా, పారదర్శకంగా, మానవ హక్కులను గౌరవించే విధంగా సాగాలి. లేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అదే తీవ్రవాద సంస్థలకు కొత్త నియామకాల అవకాశాన్ని కల్పిస్తుంది. భద్రతా చర్యలు, ప్రజాస్వామ్య విలువలు రెండూ సమతుల్యంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో సైనిక శక్తి ఒక్కటే పరిష్కారం కాదు. నిరుద్యోగం, పేదరికం, విద్యా లోపం, సామాజిక వివక్ష, రాజకీయ అస్థిరత, విద్వేష ప్రచారం వంటి మూలకారణాలను కూడా పరిష్కరించాలి. యువతలో విమర్శనాత్మక ఆలోచన, డిజిటల్ అక్షరాస్యత, శాంతి విలువలపై అవగాహన పెంపొందించడం దీర్ఘకాలిక భద్రతకు అవసరం.

గణాంకాలు పాలకులకు, పరిశోధకులకు ఉపయోగకరమైన సాధనాలు మాత్రమే; అవే సంపూర్ణ సత్యం కావు. కొన్ని ప్రాంతాల్లో దాడులు తగ్గడం ఒక సానుకూల పరిణామమే అయినప్పటికీ, అదే సమయంలో ఉగ్రవాదం తన రూపాన్ని మార్చుకుంటూ కొత్త రంగాల్లోకి ప్రవేశిస్తోంది. అందువల్ల విజయాన్ని కేవలం మరణాల సంఖ్యతో లేదా దాడుల సంఖ్యతో కొలవలేం. సమాజంలో భయం తగ్గిందా? తీవ్రవాద భావజాలం బలహీనపడిందా? యువతను అతివాద ప్రచారం నుంచి రక్షించగలుగుతున్నామా? సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం కాకుండా అడ్డుకుంటున్నామా? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు.అందుకే ప్రపంచం ఈరోజు నేర్చుకోవాల్సిన ప్రధాన పాఠం ఒక్కటే...ఉగ్రవాదం కనిపించే రూపం తగ్గిందని, అది అంతరించిపోయిందని అనుకోవడం అత్యంత ప్రమాదకరమైన భ్రమ. గణాంకాల వెనుక దాగి ఉన్న కొత్త ముప్పులను ముందుగానే గుర్తించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అంతర్జాతీయ సహకారంతో, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలతో, సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తూ ముందుకు సాగినప్పుడే నిజమైన భద్రత సాధ్యమవుతుంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com


# పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**వికారాబాద్ (జర్నలిస్ట్ డైరీ)** ఈరోజు వికారాబాద్ మండలంలోని బురంత పల్లి గ్రామంలో తెలంగాణ శాసనసభ సభాపతి వికారాబాద్ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి ఆదేశాల మేరకు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి గారు మరియు వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ. చాపల శ్రీనివాస్ ముదిరాజ్ గారు,ాావీజ వైస్ చైర్మన్ పి మల్లేశం గారు...ఈ సందర్భంగా ఇంటి యజమాని పెద్దింటి సునీతజంగయ్య గార్లకు అభినందనలు తెలియజేసి శ్రీ గడ్డం. ప్రసాద్ కుమార్ గారు పంపినటువంటి ఇందిరమ్మ కానుక నూతన వస్త్రాలను వారికి బహుకరించడం జరిగింది... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకోవడం ఎన్నో ఏళ్ల కలగా ఉండేదని ఆ కలను నిజం చేసిన కాంగ్రెస్ పార్టీకి మరియు వికారాబాద్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రజానాయకుడు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్. వికారాబాద్ మీూా శ్రీ. గడ్డం. ప్రసాద్ కుమార్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసి జీవితాంతం తాము కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని సంతోషం వ్యక్తం చేసారు.

# భద్రకాళి దేవాలయంలో శాకాంబరి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ఉమ్మడి వరంగల్ జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)** వరంగల్ నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయంలో ఈనెల 15 నుంచి 29 తేదీ వరకు నిర్వహించనున్న శాకాంబరి నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలించే అవకాశం ఉన్న నేపథ్యంలో దర్శనం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం ,క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.



# కీసరగుట్టలో మాస శివరాత్రి సందర్భంగా రుద్రహోమం....





**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో రుద్ర హోమం నిర్వహించారు. రుత్వికుల వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ హోమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. శివానుగ్రహం, లోకక్షేమం కోసం నిర్వహించిన రుద్రహోమం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పింది. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు.

# హనుమాన్ నగర్ శివాలయాని దాతల సహకారంతో స్లాబ్....



**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)**
దాతల సహకారంతో నాగారం డివిజన్ పరిధిలోని న్యూ హనుమాన్‌నగర్ కాలనీలో ఉన్న శివాలయానికి స్లాబ్ ను నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేయించడం జరిగింది. శివాలయం కు నూతన సిమెంట్ కప్పు వేసేందుకు సహసకరించిన శ్రీనివాసరెడ్డికి కాలనీ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ముప్పు శ్రీనివాస్ రెడ్డిని కాలనీకి ఆహ్వానించి, ఆలయ అభివృద్ధికి అందించిన సహాకారానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# వికారాబాద్ జిల్లాలో యువకుడి అదృశ్యం

**వికారాబాద్ జిల్లా (జర్నలిస్టు డైరీ) జూలై 12**


నవాబుపేట్ మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన పోతురాజు ప్రదీప్ కుమార్ (అజయ్) ఈనెల 7న విధులకు వెళుతున్నాన అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోగా వికారాబాద్ ఆర్టీసీ బస్ డిపోలో టిమ్స్ ఆపరేటర్ గా కాంట్రాక్ట్ వర్కర్ గా పనిచేస్తున్నాడు ప్రదీప్ కుమార్ తిరిగి ఇంటికి రాకపోగా తమ తల్లిదండ్రులు బంధువులకు మరియు యువకుడు ఫ్రెండ్స్ కి ఫోన్ చేసి సమాచారం అడగగా తమ వద్దకు రాలేదని తెలిపారు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ యువకుడు ఆచూకీ తెలిసినవారు వెంటనే ఈ క్రింది నవాబుపేట పోలీస్ స్టేషన్ (8712670039 ) లేదా తండ్రి త్యాగరాజు ( 9704963510) (9701539749 ) నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు

# చిట్టిగిద్దలో ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**వికారాబాద్ జిల్లా (జర్నలిస్ట్ డైరీ ) జులై 12**
నవాబుపేట్ మండలం చిట్టిగిద్ద గ్రామం లో
చత్రపతి శివాజీ మహారాజ్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు వార్డ్ మెంబర్ సందీప్ మరియు నదీమ్ రాములు అనిల్ కుమార్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చినటువంటి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య నవాబుపేట్ మండల నాయకులు నాగిరెడ్డి ఖదీర్ పోలీస్ రామ్ రెడ్డి ఎక్స్ ఎమ్మెల్యే కెఎస్ రత్నం మాజీ సర్పంచ్ గోపాల్ వికారాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు గాలయ్య మరియు జి శ్రీనివాస్ బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ శ్రీకాంత్ రెడ్డి ఇతర నాయకులు గ్రామస్తులు సిల్వరి నరసింహులు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి మాణిక్య రెడ్డి గూడ రమేష్ ప్యాంట శివకుమార్ శ్రీనివాస్ ప్రశాంత్ మహేష్ వెంకటేశం అర్జున్ గౌడ్ విష్ణు గౌడ్ బందయ్య గౌడ్ మధుకార్ రెడ్డి అరుణ్ కుమార్ టిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత కుమార్ బక్కని నవీన్ పోతురాజు వందేమాతరం విష్ణువర్ధన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# డంపింగ్ యార్డ్‌తో భవిష్యత్తు అంధకారం..

- -షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- -చేయి చేయి కలుపుదాం.. డంపింగ్ యార్డ్ కు మద్దతు తెలుపుదాం..
- -డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ.
- -కొడిచెర్ల, కొడిచర్ల తాండ, ఖాజా గూడా తండాలలో భారీ ర్యాలీ.
- -మద్దతు తెలిపిన బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :**
డంపింగ్ యార్డ్ తో భవిష్యత్తు అంధకారం అవుతుందని, పచ్చని పంట పొలాల మధ్య చెత్త కంపును ఏర్పాటు సబబు కాదని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ డంపింగ్ గాడ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కొడిచెర్ల, కొడిచెర్ల తాండ, ఖాజాగూడ తండాలలో పర్యటించి డంపింగ్ యార్డ్ వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ... ఓడిన ఎమ్మెల్యే ప్రజల మధ్య తిరుగుతూ ఉంటే గెలుపొందిన ఎమ్మెల్యే మాత్రం ఎక్కడున్నాడో మీరే చెప్పాలని అన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కావాలని అడిగితే చెంత కంపునూ తెస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని అందుకు ఊరు, వాడ, తాండాలు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించమంటే డంపింగ్ యార్డ్ ను మా నెత్తిన గుదిబండగా మోపుతున్నారని వాపోయారు. రాజకీయాలు చేయడానికి మేము రాలేదని డంపింగ్ యార్డ్ వాళ్ళ జరిగే నష్టాలు మాత్రమే చెప్పేందుకు వచ్చామని అన్నారు. కాంగ్రెస్ నాయకులు డంపింగ్ యార్డ్ రాదు రానివ్వమని చెప్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. జీవో నెంబర్ 641 ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే విడుదల చేసిందని చెప్పారు. మనమంతా మేల్కొని డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకించాల్సింది పోయి కనీసం వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాకు మద్దతు తెలుపకుండా ఇంట్లో కూర్చుని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు వడ్డే బాలయ్య, మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, మోహన్ నాయక్, రెడ్యానాయక్, దయ్యాల మల్లయ్య, దన్నాడ జంగయ్య యాదవ్, కళ్లెం నరసింహారెడ్డి, కుమ్మరిగూడెం పాండు, బాబు రాజ్, శంకర్ నాయక్, రాందాస్ నాయక్, గోపాల్ నాయక్, బిచ్చా నాయక్, సంతోష్ నాయక్, భాస్కర్ నాయక్, జ్యోతి నాయక్, వడ్డే మల్లేష్, వడ్డే మహేష్, గుని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ ఆరు హత్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం

- -హోం మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి
- -బిఆర్ఎస్ నాయకురాలు గడ్డం రాజ్యలక్ష్మి
- -మహిళల భద్రతలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం
- -పోలీసుల నిర్లక్ష్యమే రెండు కుటుంబాల ప్రాణాలు తీసింది
- -బెయిల్‌పై వచ్చిన నిందితుడిపై ముందే చర్యలు తీసుకోవాల్సింది
- -బాధిత వికలాంగురాలికి రూ.50 లక్షల ఆర్థిక భద్రత కల్పించాలి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గడ్డం రాజ్యలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. పరిపాలనా వైఫల్యం కారణంగా పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అదే నిర్లక్ష్యం కారణంగా రాజ్‌కుమార్ వంటి వ్యక్తుల చేతుల్లో రెండు కుటుంబాలు బలయ్యాయని విమర్శించారు. ఫోక్సో కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు బాధిత కుటుంబాన్ని బెదిరించినప్పుడే వారు పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరినా స్పందించలేదని, ఆ నిర్లక్ష్యమే ఈ దారుణానికి కారణమైందని ఆమె పేర్కొన్నారు. పసిపిల్లలను సైతం వదలకుండా రెండు కుటుంబాలను హతమార్చిన నిందితుడిని వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గతంలో దిశా ఘటనలో ప్రభుత్వం తీసుకున్న తరహా కఠిన చర్యలను ఈ కేసులోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన వికలాంగురాలిని కేవలం ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి చేతులు దులుపుకోవద్దని, ఆమె పేరుపై రూ.50 లక్షలు డిపాజిట్ చేసి శాశ్వత ఆర్థిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆమెను అనాథగా మార్చిన ప్రభుత్వమే ఆమె భవిష్యత్తుకు పూర్తి బాధ్యత వహించాలని గడ్డం రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు.

# మసీదు బండలో రూ. 4 కోట్లతో వరద కాలువ నిర్మాణం పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12( జర్నలిస్ట్ డైరీ) :**
శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లోని కుడికుంట చెరువు అలుగు నుండి మసీదు బండ ప్రభుపాద లే ఔట్ కాలనీ వరకు రూ. 4 కోట్ల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం పనులను సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా మాట్లాడుతూ... మసీదు బండ లోని ప్రభు పాద లే ఔట్ కాలనీ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, సుమారుగా 4 కోట్ల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపుకు గురి అవుతుంది అని ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలుంను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు తెలియచేశారు
కుడి కుంట చెరువు ఔట్ లెట్ నుండి నీటి ప్రవాహం అధిక మొత్తంలో వస్తుంది కావున చెరువు ఔట్ లెట్ ను పరిగణలోకి తీసుకోవాలని, మళ్ళీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల పై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలియచేశారు.అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని PAC చైర్మన్ గాంధీ గారు చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఐజు ఆనంద్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# షాబాద్ ఘటనలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి

**-కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్**

**-పోలీసులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు**

**-నిందితుడికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ)** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటన అత్యంత బాధాకరమని కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ఘటనలో నిందితుడికి సహకరించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఘటన పూర్తిగా పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. కేవలం సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ ఘటనకు దారితీసిన అన్ని కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుడికి ఎలాంటి సహకారం అందించినా, అతడి తరఫున ఎవరైనా పైరవీలు చేసినా వారిని కూడా చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పోలీసులకు ఫోన్ చేసి నిందితుడి తరఫున మాట్లాడిన రాజకీయ నాయకులు లేదా ఇతర వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి వివరాలను బహిర్గతం చేసి, వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా, నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. చివరగా, ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు

# జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలి

**- డంపింగ్ యార్డు ఇక్కడి నుండి తరలించకుంటే ఉద్యమం ఉధృతమే....కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్...**



**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఒక్క గుదిబండగా తయారైందని కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్ పేర్కొన్నారు. ఉమ్మడి కీసర మండల పరిధిలో జాయింట్ యాక్షన్ కమిటీలో భాగంగా జరుగుతున్న ధర్నాలను, నిరసనలను నియంత్రించాలనే దురుద్దేశంతో రాష్ట్ర సర్కార్ నేతలను ముందస్తు అరెస్టులు చేయడం కీసర మండల అంబేద్కర్ సంఘం తీవ్రంగా ఖండించింది. ఆదివారం 231వ వారం జ్ఞానమాల కార్యక్రమం మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహేబ్ అంబేద్కర్ గారికి జ్ఞానమాల సమర్పించారు. రాంకి సంస్థను ఎత్తివేయాలని డిమాండ్...జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఇక్కడ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాల దాటినా, రాష్ట్ర సర్కార్లు మారిన రాంకి సంస్థను ఇక్కడినుండి తరలించలేక పోవడం పాలకుల చేతకానితనంకు నిదర్శనం. మా బ్రతుకులు ఛిద్రం అవుతున్నాయి, మా ఆరోగ్యాలు పాడవుతున్నాయి, మా వనరులు కుప్పములిపోతున్నాయి మాకు న్యాయం కావాలి... ఇక్కడి నుండి రాంకి సంస్థను తరలించాలని పోరాటంకు స్థానికులుగా పోరాటం చేస్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టులేంటని కీసర మండల అంబేద్కర్ సంఘం ప్రశ్నిస్తుంది. జవహర్ నగర్ డంపింగ్ చాలదనట్లు రాంపల్లిలో మరో డంపింగ్ ఏర్పాటా.....రాంకి సంస్థ చేస్తున్న ఉదార్కం జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు చాలదనట్లు ఉమ్మడి కీసర మండలంలో ప్రశాంత వాతావరణంలో ఉన్న రాంపల్లి గ్రామంలో మరో డంపింగ్ యార్డు ఏర్పాటు రాష్ట్ర సర్కారు చేస్తున్నాం అంటుండటం సిగ్గుచేటు. ప్రజల నుండి వచ్చే పాలన వ్యతిరేక ఉద్యమంను ఆపడం ఎవరితరం కాదనే విషయం పాలకులు గమనించాలని జవహర్ నగర్ డంపింగ్ డంపింగ్ యార్డును, రాంకి సంస్థను మేడ్చల్ నియోజకవర్గము నుండి తరలించే వరకు ఈ ఉద్యమం ఆగదనే విషయం పాలకులు గమనించాలని కీసర మండల అంబేద్కర్ సంఘం హెచ్చరిస్తుంది. ఈ కార్యక్రమంలోబీఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి, బీఆర్ ఎస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్, కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు గోరంటి ప్రవీణ్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శి మంచాల మహేష్, బిజెపి సీనియర్ నాయకులు మొరుగు మహేష్ పలువురు పాల్గొన్నారు.

# రాంపల్లిలో పేదల స్థలంలో డంపియార్డ్.. అడ్డు కోవాలని ఎంపి ఈటెల కు వినతిపత్రం....



**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** రాంపల్లి సర్వే నం. 226లో కుమ్మరి, వడ్డరి, ఎరుకల వంటి పనిముట్ల కులాలకు గతంలో ప్రభుత్వం సుమారు 8 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం అదే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేయడాన్ని గ్రామస్థులు, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం శ్యామసుందర్ శర్మ ఆధ్వర్యంలో కుమ్మరి--వడ్డరి--ఎరుకల పనిముట్ల సంఘాల ప్రతినిధులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను రక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఈ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల జీవనాధారం ఈ భూములతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న కాలనీ మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హానికరమని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కీసర ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడిన ఈటెల రాజేందర్ రాంపల్లిలో కుమ్మరి, వడ్డరి, ఎరుకల కులాల జీవనాధారానికి సంబంధించిన భూముల జోలికి వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తాను స్వయంగా రాంపల్లికి వచ్చి ధర్నాలో పాల్గొని ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా కుమ్మరి, వడ్డరి, ఎరుకల సంఘాల కోసం ఎంపీ నిధుల ద్వారా మొత్తం రూ. 30 లక్షలు (ప్రతి సంఘానికి రూ. 10 లక్షలు చొప్పున) కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి మంజూరు చేసినట్లు ఈటెల రాజేందర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ మునిగంటి సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు బొమ్మిడి బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామారంగిరి గౌడ్, భరత్ ముదిరాజ్, మల్యాల మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డైట్ కళాశాలలో బోధనకు ఇన్సర్వీస్ టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**వికారాబాద్, (జర్నలిస్ట్ డైరీ)జూలై 12:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో వివిధ సబ్జెక్టులను బోధించడానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ, ఇంగ్లిష్, గణితం, ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీ, సైన్స్, తెలుగు సబ్జెక్టులతో పాటు.. ఉర్దూ మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, ఉర్దూ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 14వ తేదీ లోగా schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా

**మహ్మద్ ఖాజా... అభినందించిన పలువురు**



**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా మహమ్మద్ కాజా మైనుద్దీన్ కి పలువురు హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు, కీసర మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటిసి బెలిదే రమేష్ గుప్తా,కాంగ్రెస్ నాయకులు (మాజీ వర్కింగ్ ) ప్రసిడెంట్ విజయ్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కృష్ణారెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు మెంబెర్ మొరుగు ముత్యాలు, మాజీ కీసర మండలం పిఏసిఎస్ అధ్యక్షులు గుర్రం లక్ష్మారెడ్డి, కీసర మండలం కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు కర్రే బాలమణి, కీసర మండలం రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కృష్ణ రెడ్డి, కీసర కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# రాజ్ సుక్ నగర్ అన్నపూర్ణ కాలనీలో వెలగని వీధి దీపాలు...

**జాయింట్ యాక్షన్ కమిటీ స్పందన**




**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ రాజసుక్ నగర్ అన్నపూర్ణ కాలనీలో గత ఐదు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ సమస్యను వెంటనే సంబంధిత ఎంఎంసి విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీధి దీపాలను అత్యవసరంగా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నాము. స్థానిక ప్రజలకు జాయింట్ యాక్షన్ కమిటీ హామీ ఇస్తోంది. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ వీలైనంత త్వరగా పరిష్కారం జరిగేలా కృషి చేస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది.

# రాంపల్లిలో డంపింగ్ యార్డ్ ను అడ్డుకుంటామా....రాంపల్లి ప్రజల ఆందోళన...







**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** రాంపల్లిలో మొత్తం 30 ఏకరాల 20 గుంటలలో 2 ఏకరాల లో తడిచెత్తా - పొడి చెత్తా వేరుచేసి లారీల్లో డంపింగ్ యార్డ్ కి తలించడానికీ గత నాగారం మునిసిపాలిటీ అనుమతి ఇట్చిందీ. ఇప్పుడు 6 యెకరల్లో మినీ డంపింగ్ యాడ్ చెయ్యలని ప్రభుత్వశీ అలోచిస్తోందిలని, దీనిని ప్రజలు అడ్డు కోకపొతే కుమ్మరి, వడ్డరి అనేక సంఘాలకు కెటాయిశీచిన కొన్ని యెకరాలలో ఉన్న భూమినీ లాక్కుని మరో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ లా తయారయే ప్రమాదశీ ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంపల్లిని మరో జవహర్ నగర్ ను చేయవద్దని, దానిని అడ్డుకొనేందుకు ప్రజలు సమైక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని రాంపల్లి వివిధ కాలనీల నాయకులు పిలుపునిచ్చారు.

# రాంపల్లిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ నెల 14న దర్నా....





**నాగారం, జూలై 12:-(జర్నలిస్ట్ డైరీ)** రాంపల్లిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 14 మంగళవారం రాంపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే దర్నాను జయప్రదం చేయాలని నిర్వహకులు తెలిపారు. ఈ దర్నాలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ఈ ధర్నా పోస్టర్ ని వివిధ కాలనీల గ్రూపులలో మరియు వాట్సప్ స్టేటస్ కూడా పెట్టండి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 11వ రోజు రిలే నిరాహార దీక్షలు.



**హైదరాబాద్: (జులై 12). జర్నలిస్ట్ డైరీ..**
తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తెలుగు భాషా విభాగం విద్యార్థులు వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణలో తెలుగు విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.
మాజీ ఉపకులపతి ఎన్. గోపి దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమానికి తన సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వం ఇరు పక్షాలతో చర్చించి సముచితమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని అభినందిస్తూ, విశ్వవిద్యాలయ ఆస్తులు, వారసత్వం, చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతరకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ఆహ్వానం




**హైదరాబాద్:(జులై 12) జర్నలిస్ట్ డైరీ..**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తొలి బోనాల జాతరకు కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ని ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర ఆహ్వాన పత్రికను మంత్రి కి అందజేశారు.కన్వీనర్ ఆడాల గణేష్ ఉత్సవాల విశిష్టతను వివరిస్తూ, కార్యక్రమానికి విచ్చేసి జాతరను విజయవంతం చేయాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయం: ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



**ఉమ్మడి వరంగల్ జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :**
యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ కొత్త వ్యాపారాలను ప్రారంభించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజీపేట మండలం 47వ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబిషన్ ఫ్యాషన్ హబ్ కంప్లీట్ మెన్స్ వేర్ షాపును ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ అంబిషన్ ఫ్యాషన్ హబ్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన మెన్స్ వేర్‌ను అందిస్తూ,మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో నిజాయితీ,నాణ్యత, వినియోగదారుల విశ్వాసమే విజయానికి మూలమనిపేర్కొన్నారు.అనంతరం షాప్ యజమాని పిట్ట సాయి కుమార్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ,వారి వ్యాపారం రోజురోజుకు అభివృద్ధి చెందాలని, మరిన్ని శాఖలను ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ ఎం సి 47 వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయకుమార్, మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రపు కోటేశ్వర్ , బోయిన కుమార్ యాదవ్ , రాజారపు స్వామి , ఉమ్మడి బాబు , సత్యవరం మధుకర్ , గంగుల రాజు రెడ్డి , అశోక్ , సురేందర్ , గంగుల శ్రీనివాస్ రెడ్డి , కటుకూరి రమేష్ , మహమూద్ , కిషన్ , మహిళా నాయకురాలు శోభ , అనిత రెడ్డి , ప్రగతి, శేఖర్, జార్జ్, శీను, మాస్, చింటూ, యాసీన్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు , యూత్ మెంబర్స్, జంగా అభిమానులు, ప్రజాప్రతినిధులు,స్నేహితులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఇకనైనా మేలుకుందాం





**-షాద్ నగర్ తెలంగాణ ఉద్యమకారులు"**
**-నిజమైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి..**
**-ఈ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించకూడదు**
**-షాద్ నగర్ "టీయూ జేఏసీ" నూతన అధ్యక్షులుగా టీజీ శ్రీనివాస్**
**-గౌరవ అధ్యక్షుడిగా పినపాక ప్రభాకర్**
**-ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ రెడ్డి**
**-ఉపాధ్యక్షులుగా నందిగామ సురేష్, దిలీప్ కుమార్, రామారావు, సిరాజుద్దీన్, తదితరులు..**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :**
గత పదేళ్ళు ఉద్యమకారులను బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా మేనిఫెస్టోలో ఎన్నో విషయాలను చెప్పి రెండున్నర ఏళ్ళు గడుస్తున్నప్పటికీ ఉద్యమకారులకు అతిగతి లేకుండా పోయిందని సాధ్యమైనంత తొందరగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ప్రభుత్వపరంగా గుర్తించి ఆదుకోవాలని షాద్ నగర్ ప్రాంత తెలంగాణ ఉద్యమకారులు పలువురు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆదివారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మలిదశ ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆయా రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు జర్నలిస్టులు పలువురు ఈ కార్యక్రమానికి హాజరై సభలో తమ అభిప్రాయాలను వినిపించారు. ఈ సందర్భంగా "తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక" (టీయూ జేఏసీ)నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక (టీయూ జేఏసీ)**
టీయూ జేఏసీ గౌరవ అధ్యక్షులుగా పినపాక ప్రభాకర్, అధ్యక్షులుగా టీజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ రెడ్డి, అదేవిధంగా టీయూ జేఏసీ సలహా దారులుగా పంది వెంకట్రాంరెడ్డి, వంగూరి గంగిరెడ్డి, ఎండి ఖాజాపాషా (కేపీ), యాదవాచారి, జామి, శ్రీనివాస రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకోగా టీయూ జేఏసీ ఉపాధ్యక్షులుగా ఎండీ సిరాజుద్దీన్, కౌన్సిలర్ దిలీప్ కుమార్, రామారావు, నందిగామ సురేష్, రమాదేవి, సహాయ కార్యదర్శులుగా జాంగారి రవి, ఏ.నరసింలు, జంగయ్య,, అనురాధ కోశాధికారి: వంశీ కృష్ణ,
కార్యనిర్వాహక సభ్యులుగా వెంకటేష్ గుప్తా, రతన్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, నరసింలు, కొర్ర బాలు నాయక్, అదేట్ల రాజు, మేకల వెంకటేష్ ముదిరాజ్, ఆర్ల యాదయ్య యాదవ్ , ఎం రామచంద్రయ్యలను ఎన్నుకున్నారు.

**ఈ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తిస్తుంది - పి వెంకట్రాం రెడ్డి**
గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని ఈ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇళ్లస్థలాలు గుర్తింపు కార్డులు పింఛన్లు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చర్యలు చేపడుతుందని తప్పకుండా ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాన్ని వెంకట రామ్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. కలిసికట్టుగా ఉద్యమకారులందరూ ఐక్యతగా తమ సమస్యలను సాధించుకోవాలని సూచించారు.

**ఉద్యమకారులు ఎవరు..?**
షాద్ నగర్ లో అనేక వియ్య ప్రయాసలకు గూర్చి ఎన్నో కష్టానష్టాలు ఎదుర్కొని ఇబ్బందులకు గురైన నిజమైన ఉద్యమకారులు ఎవరు..? కేవలం పేరు కోసం పాకులాడుతూ రాజకీయ ప్రాబల్యం కోసం వెంపర్లాడుతున్న "ఉద్దెరకారులు" ఎవరనీ టియు జేఏసీ గౌరవాధ్యక్షుడు పినపాక ప్రభాకర్ అన్నారు. నిజమైన ఉద్యమకారులను ఎలా గుర్తించాలి వాటి సంబంధించిన వనరులను గుర్తించాలని అన్ని విధాల వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉన్నవారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమం వారికి అందించేలా చూడాల్సిన బాధ్యత తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదికపై ఉందని అన్నారు.

**ఉద్యమంలో ఉద్యోగాన్ని కోల్పోయా - టీజీ శ్రీనివాస్**
తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఇబ్బందులకు గురై రాజకీయ నేతల చేతిలో సమిదగా మారి చివరకు తాను తన ఉద్యోగాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చిందని ఆనాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్టుగా టీయూజేఏసీ అధ్యక్షుడు టిజి శ్రీనివాస్ వివరించారు. ఇకపై ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారి జాబితాను సిద్ధం చేసి ఉద్యమకారుల సంక్షేమానికి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

**ఉద్యమకారులు ఏమన్నారంటే..**
తెలంగాణ ఉద్యమకారులు అబ్దుల్ రబ్బామీ మాట్లాడుతూ
నాటి ఉద్యమంలో మైనార్టీల పాత్ర ఎంతో కీలకంగా ఉందని 5000 మందితో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం అందరిని సమానంగా గుర్తించాలని అన్నారు. జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర, అదేవిధంగా భవిష్యత్తులో ఉద్యమకారులకు అండదండగా మీడియా ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులు నరసింహులు మాట్లాడుతూ.. ఉద్యమకారుల విషయంలో ప్రభుత్వాలు హామీలు ఇస్తూనే వస్తున్నాయని అవి నెరవేరడం లేదని నెరవేరేల అందరు ఏకతాటిపైకి వచ్చి సమస్య సాధన కోసం కృషి చేయాలని సూచించారు. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తన జీవితం మొత్తం తెలంగాణ ఉద్యమం కోసమే త్యాగం చేశామని ఇప్పటికైనా అందరికీ న్యాయం జరిగేలా చొరవ చూపాలని అన్నారు. నందిగామ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో కెసిఆర్ ఉద్యమకారులను గుర్తించలేదు, ఇప్పుడు ముఖ్యమంత్రి గుర్తిస్తారా? లేక కమిటీల పేరిట కాలయాపన చేస్తారా? లేక ఉద్యమకారులను మభ్యపెడతారా? వీటిపై చర్చించి ఉద్యమకారులు తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రామారావు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులను వెంటనే జారీ చేయాలని అన్నారు. అడ్వకేట్ రామస్వామి మాట్లాడుతూ.. ఉద్యమంలో నిజాయితీగా పనిచేసిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని తనలా ఎంతోమంది ఎన్నో కష్టాలు పడ్డారని ఇప్పటికైనా నిజాయితీగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని ఆయన అన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ నిజమైన ఉద్యమకారుల జాబితాను రూపొందించాలని అన్నారు. అన్ని వర్గాలు ప్రజాసంఘాలు కార్మికులు ఉద్యోగస్తులు జర్నలిస్టులు అనేక వర్గాలలో పనిచేసిన వారిని గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. కౌన్సిలర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. ఆనాడు ఉద్యమంలో ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా పనిచేశారని ఈరోజు ప్రభుత్వం ఉద్యమకారులకు సంక్షేమం చేకూర్చుతోందన్న ప్రకటనతో ఎవరెవరు ఉద్యమకారులు అంటూ వస్తున్నారని నిజాయితీగా పనిచేసిన వారిని గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా సంక్షేమం అందేలా చూడటం తమ బాధ్యత అని అన్నారు. బిజెపి నాయకులు వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ నేత ముద్దుల జంగయ్య మాట్లాడుతూ రాజకీయ తెలంగాణ వచ్చింది తప్ప సామాజిక తెలంగాణ రాలేదని అందరికీ ప్రతి ఫలాలు అందిన నాడే నిజమైన తెలంగాణ వస్తుందని అన్నారు. మనోహర్ మాట్లాడుతూ ఉద్యమకారులను గౌరవించాలని అన్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమంలో ఎన్నో అవమానాలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని నిజమైన ఉద్యమకాలను గుర్తించి న్యాయం చేయాలని అన్నారు. పి నర్సింలు మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు న్యాయం జరగాలన్నారు. మొగలిగిద్ద సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు గుర్తింపు కార్డులు అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు కూడా గౌరవం దక్కేల ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం వారి పిల్లలకు ఉండేలా చూడాలని కోరారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. విద్యార్థులను కూడా గుర్తించాలని అదేవిధంగా గుర్తింపు కార్డులు ఇళ్ల స్థలాలతో పాటు వారికి సముచిత స్థానం లభించేలా చూడాలన్నారు. జంగారి రవి మాట్లాడుతూ.. కేకే కమిటీకి నిజమైన ఉద్యమకారుల జాబితాను అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ వైద్య శిబిరంను ప్రారంభించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 12 (జర్నలిస్ట్ డైరీ) :**
మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి ఎనక్లేవ్ కాలనీలో సీనియర్ నాయకులు డిఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ వైద్య శిబిరంను సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రసాద్ ఫౌండేషన్ వారి సేవలు అమోఘం అని , క్యాన్సర్ పై అవగాహన కల్పించడం గొప్ప విషయం అని, క్యాన్సర్ ను ముందే పసిగడితే సగం విజయం సాధించినట్టే, అన్ని రకాల పరీక్షలకు చేసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగినది. ఇక్కడి పరిసర ప్రాంత పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అంటే ఎటువంటి లక్షణాలు లేని ఆరోగ్యవంతమైన వ్యక్తులలో కూడా క్యాన్సర్ కణాలు లేదా ముందస్తు కణాలను ముందుగానే గుర్తించే పరీక్షలు. దీన్ని ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను సులభంగా నయం చేయవచ్చుఅని , క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స



విజయవంతమయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి అని తెలియచేశారు. రోజువారి జీవనశైలిలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు వైద్య శిబిరం ఎంతగానో తోడ్పడుతుంది అని తెలియచేసారు. ఇందులో భాగంగా.స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగినది అని తెలియజేసారు. ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను, డాక్టర్లను ప్రత్యేకంగా అభినదించడం జరిగినది. ప్రతి ఒక్కరు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అంతే కాకుండా సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రజల నుండి అనూహ్య స్పందన లభించి, ఈ శిబిరంలో పెద్ద ఎత్తున కాలనీ వాసులు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్నారు.
ప్రసాద్ ఫౌండేషన్ వారు ఇలాంటి అర్థవంతమైన సేవా కార్యక్రమాల ద్వారా సమాజ ఆరోగ్య సంరక్షణ మరియు క్యాన్సర్ నివారణ అవగాహనకు ఎంతగానో కృషి చేస్తున్నారు అని తెలియచేశారు
ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ప్రియదర్శి 'ఇడుపు కాయితం' షూటింగ్‌కు రెడీ..

## -గ్రామీణ నేపథ్యంలో హార్ట్‌టచింగ్ కథతో రాబోతున్న చిత్రం




వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన హీరోగా, నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న 'ఇడుపు కాయితం' సినిమా ప్రస్తుతం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన వర్క్‌షాప్ సెషన్స్ విజయవంతంగా పూర్తయ్యాయని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. 'ఇడుపు కాయితం' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పల్లె జీవితంలోని భావోద్వేగాలు, బంధాలు, అనుబంధాలను ప్రతిబింబించే స్వచ్ఛమైన గ్రామీణ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది.పక్కా లోకల్ నేటివిటీకి ప్రాధాన్యం ఇస్తూ కథను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాలో తెలంగాణ సంస్కృతి, భాష, యాసకు ప్రత్యేక స్థానం ఉండనుంది. అందుకే తెలంగాణ నేపథ్యానికి చెందిన పలువురు నటీనటులను కీలక పాత్రల కోసం ఎంపిక చేసినట్లు సమాచారం. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ సమర్పణలో, నిర్మాత బన్నీ వాస్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు తగ్గట్టుగా హృదయాన్ని హత్తుకునే సంగీతాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వర్క్‌షాప్‌లు పూర్తవడంతో నటీనటులు తమ పాత్రలకు పూర్తిగా సిద్ధమయ్యారు. పాత్రల సహజత్వం, గ్రామీణ జీవనశైలిని తెరపై నిజాయితీగా ఆవిష్కరించేందుకు ఈ వర్క్‌షాప్‌లు ఉపయోగపడ్డాయని చిత్ర బృందం తెలిపింది. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'ఇడుపు కాయితం' సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రియదర్శి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకంతో చిత్ర బృందం ఉంది. గ్రామీణ నేపథ్యం, హృదయాన్ని హత్తుకునే కథ, బలమైన పాత్రలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



అబ్బా అనిపించేలా నభా నటేష్ అందాలు..

# బాక్సాఫీస్ వద్ద అఖిల్ 'లెనిన్' ర్యాంపేజ్..

## - రెండు రోజుల్లోనే రూ.37.2 కోట్లు!




అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ పర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతుండటంతో ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన మౌత్ టాక్ లభిస్తోంది. ఆడియన్స్ నుండి వస్తున్న భారీ రెస్పాన్స్‌తో ఈ సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ రాబట్టిన ఈ చిత్రం, రెండవ రోజు కూడా అదే జోరును కొనసాగిస్తూ దూసుకుపోతోంది. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో రూరల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు ఎస్ఎస్ థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చాలా కాలం తర్వాత అఖిల్‌కు సాలిడ్ కమర్షియల్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు థియేటర్ల వద్ద పండగ చేసుకుంటున్నారు. వీకెండ్ ముగిసేసరికి ఈ వసూళ్లు మరిన్ని రికార్డులను బద్దలు కొట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి

# సమంత మా ఇంటి బంగారం అరుదైన ఫీట్..

## -ఇంతకీ ఏంటో తెలుసా..?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్‌ఫుల్ టాక్‌తో రన్ అవుతోంది. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ నిర్మించిన విషయం తెలిసిందే. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఫేమేల్ ఓరియెంటెడ్ సినిమాగా వచ్చిన మా ఇంటి బంగారం కాసుల వర్షం కురిపిస్తోంది. 24వ రోజులోకి ఎంట్రీ ఇచ్చింది.మా ఇంటి బంగారం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరైంది. ఈ ఫీట్ సాధించిన టాలీవుడ్ ఫీ మేల్ సెంట్రిక్ సినిమాగా అరుదైన రికార్డును ఖాతాలో వేసుకుంది. సమంత భర్త, డైరెక్టర్ రాజ్ నిడిమోర్ ఈ చిత్రానికి కథనందించగా.. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించాడు. థియాట్రికల్ రన్‌లో ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తన జోరు కొనసాగిస్తోంది. మరి రాబోయే రోజుల్లో మా ఇంటి బంగారం ఇంకెన్ని వసూళ్లు రాబడుతుందో చూడాలి. ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగే ఈ సినిమాలో సామ్‌ను సరికొత్తగా కనిపిస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనే నేపథ్యంలో సాగే ఈ సినిమాపై మీరూ ఓ లుక్కేయండి మరి.



# నాదీ అదే బాట

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' సినిమాతో హీరోయిన్‌గా పరిచమైన తెలుగు అమ్మాయి శివానీ నగరం. మొదటి సినిమాతోనే ప్రేక్షకుల మనసులు దోచుకుంది. రెండో సినిమా 'లిటిల్ హార్ట్స్'తో సూపర్ హిట్ కొట్టేసింది. అందులో ఆమె పోషించిన కాత్యాయని పాత్ర బాగా హైలెట్ అయింది. ముచ్చటగా మూడో చిత్రం 'హే బలవంత్'లోనూ మెరిసి మరో విజయాన్ని అందుకున్న ఈ ముద్దుగుమ్మ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా శివానీ పంచుకున్న కార్వాన్ కబుర్లు ఇవి నేను పుట్టింది, పెరిగింది అంతా హైదరాబాద్‌లోనే. చిన్నప్పుడే కూచిపూడి నేర్చుకున్నాను. పెద్దాయ్యాక కొన్నిరోజులు కూచిపూడి డ్యాన్స్ టీచర్‌గా పనిచేశాను. సినిమాల్లోకి రాకమందు పాకెట్ మనీ కోసం నా తమ్ముడితో కలిసి హౌస్ ఈవెంట్లు, లైవ్ బ్యాండ్స్, బర్త్‌డే పార్టీలు లాంటి ఈవెంట్లలో పాటలు పాడేదాన్ని. అలా వచ్చిన డబ్బును ఇద్దరం పంచుకునేవాళ్లం. నా మొదటి సినిమాలో పాట పాడాలనుకున్నా కుదరలేదు. నేనే నటించే సినిమాలో ఎప్పటికైనా ఓ గీతాన్ని ఆలపిస్తాను. ఈ మధ్య సోషల్‌మీడియాలో చాలామంది ఒక విషయాన్ని పూర్తిగా వినకుండానే జడ్జ్ చేస్తున్నారు. నా విషయంలోనూ అదే జరిగింది. ఓ ఇంటర్వ్యూలో ఆధ్యాత్మికత గురించి మాట్లాడుతూ.. కేదార్‌నాథ్, రామకోటి రాయడం, షిర్డీ, తిరుమల తిరుపతి శ్రీవారి దర్శనం గురించి చెప్పుకొచ్చాను. శ్రీవారి దర్శనం విషయంలో నా అనుభూతిని పంచుకున్న తీరును అపార్థం చేసుకున్నారు. ఆ విషయంలో క్షమాపణలు కూడా చెప్పాను. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాను. ఫొటోలు, సినిమా అప్‌డేట్లను షేర్ చేస్తుంటాను. ప్రకృతిని చూస్తే నన్ను నేను మర్చిపోతా. అందుకే తరుచూ రోడ్ ట్రిప్‌లకు వెళ్తుంటా. ఫంక్షన్లు, పండుగలకు చీరకట్టు, లెహంగాల్లో సంప్రదాయంగా తయారవుతాను. 'అంతర్గత' షార్ట్‌ఫిల్మ్‌తో నటిగా అడుగులు వేశాను. ఆ తర్వాత 'మిస్టర్ గర్ల్‌ఫ్రెండ్' వెబ్‌సిరీస్‌లోనూ నటించాను. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'లో అవకాశం ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి ఆడిషన్‌కు వెళ్లాను. స్నేహితురాలి పాత్ర కోసం వెళితే ఏకంగా హీరోయిన్‌నే చేశారు. రెండో సినిమాకే అవార్డు రావడమనేది చాలా సంతోషించే విషయం. 2025 సంవత్సరానికి గాను ప్రదానం చేసిన 'కళావేదిక ఎన్టీయార్' అవార్డులలో ఏకంగా ఆరు పురస్కారాలు 'లిటిల్ హార్ట్స్' చిత్రమే గెలుచుకున్నది. అందులో నాకు ఉత్తమ నటి అవార్డు దక్కడం నా సినీ కెరీర్‌లో తొలిమెట్టుగా భావిస్తున్నాను. తెలుగు అమ్మాయినే అయినా ఇతర భాషల్లోనూ సినిమాలు చేయాలనే కోరిక ఉంది. అందుకే తమిళంలో ఎంట్రీ ఇస్తున్నాను. శివరాజ్ కుమార్ లాంటి సీనియర్ యాక్టర్‌తో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. గతంలో శ్రీదివ్య, అంజలి, బిందుమాధవి, ఆనంది లాంటి తెలుగమ్మాయిలు తమిళ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చున్నారు.
నాదీ అదే బాట.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465